సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం ׀ 2 ׀ సెప్టెంబర్ ׀ 2024



నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు.



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6 వేలు. సరాసరి రూ.14 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

31.3°/22.4°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. పగలంతా ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం



కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయం నుంచి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్ణాటకలోని తుమకూరు, బళ్లారి ప్రాంతాల్లో భారీ వర్షాలతో పాటు జిల్లాలోని రొళ్ల, రొద్దం, లేపాక్షి, చిలమత్తూరు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని సమాచారం అందిందని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడా వర్షపునీరు రోడ్డుపై నిలవకుండా చూడాలని, తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ లేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్, మలాథియన్ స్ప్రే చేయాలన్నారు. పంట నష్టాలు, హౌసింగ్, విద్యుత్, రహదారుల నష్టం వివరాలను ఎప్పటికప్పుడు అందజేయాలని తెలిపారు. కంట్రోల్ రూం నంబర్ 08555-292432ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి

అనంతపురం అర్బన్: పలువురు తహసీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించింది. రాష్ట్రవ్యాప్తంగా 32 మంది ఉండగా, ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి పదోన్నతి దక్కింది. జిల్లా నుంచి కె.విజయలక్ష్మి (ఆర్‌డీఓ కార్యాలయ పరిపాలనాధికారి), ఆర్.వి.సునీతబాయి (విడపనకల్లు తహసీల్దారు) పదోన్నతి పొందారు. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి ఎం.అనుపమ (పుట్టపర్తి తహసీల్దారు) పదోన్నతి లభించింది. వీరికి ప్రభుత్వం త్వరలో స్థానాలు కేటాయించనుంది.

తుపాన్ ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ సన్నద్ధం



మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: తుపాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పోలీస్ శాఖ సన్నద్ధంగా ఉండాలని ఎస్పీ రత్న అధికారులకు సూచించారు. ఆదివారం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ టెలికాన్ఫరెన్స్ ద్వారా తుపాన్ ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన జాగ్రత్తలు, చర్యలు గురించి తెలియజేశారు. రెండు రోజులపాటు ముంపు, చెరువు, కుంటల ప్రాంతాల సమీపంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు హిందూపురం, పుట్టపర్తి, కేశాపురం, వెల్దుర్తి, ధర్మవరం ప్రాంతాల్లో చిత్రావతి, వంగవీరు నదుల వద్ద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు, కాలువల వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు ప్రజలు దాటకుండా పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు ప్రాంతాల్లో దండోరా వేయించి ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

యువకుడి ప్రాణం తీసిన వాటర్ హీటర్



రంగస్వామి (ఫైల్)

ధర్మవరం అర్బన్: వాటర్ హీటర్‌ను చేతిలో పట్టుకుని పరధ్యానంలో స్విచ్ ఆన్ చేయగా విద్యుత్‌షాక్ తగిలి యువకుడు మృతి చెందిన సంఘటన ధర్మవరంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన జయలక్ష్మి కుమారుడు రంగస్వామి(22) కూలి మగ్గం నేస్తూ తల్లికి తోడుగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి స్నానం చేయాలని వాటర్ హీటర్ చేతిలో పట్టుకుని ఆలోచనలో పడ్డ రంగస్వామి పొరపాటున స్విచ్ ఆన్ చేశాడు. అంతే విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుండె గుడిలో రాజన్న



ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నది కేవలం ఐదేళ్ల మూడు నెలలే. అయినా, మంచి చేయాలన్న మనసుంటే ప్రజలకు ఎంత మేలు చేయవచ్చో ఆ కొద్ది కాలంలోనే చేసి చూపారు. అన్నదాతలకు ఆత్మబంధువయ్యారు. పంట ఎండినా నష్టపోమనే ధీమా కల్పించారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించారు. పేద విద్యార్థులకు బాసటగా నిలిచారు. జలయజ్ఞంతో బీడు భూములను సస్యశ్యామలం చేశారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకూ పథకాలు దరి చేర్చి ఆపన్న హస్తం అందించారు. అందుకే మహానేత మరణించి 15 యేళ్లు కావస్తున్నా అందరి మదిలో నేటికీ కొలువై ఉన్నారు.

నేడు మహానేత వైఎస్సార్ 15వ వర్ధంతి



హంద్రీనీవా సుజల స్రవంతి పథకంలో భాగంగా వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద నిర్మించిన లిఫ్ట్

అనంతపురం అగ్రికల్చర్: వర్షాలు లేవు, పంటలు పండటం లేదు, పెట్టుబడులు కూడా దక్కడం లేదు. ఇంటింటా అప్పుల కుప్పలు పెరిగాయి. పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఎలా చేయాలో తెలియడం లేదు. చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబ పోషణ కూడా భారమైపోయింది. లక్షల మంది పొట్ట చేత పట్టుకుని పక్క రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారు. అప్పులు తీర్చ లేక చాలా మంది రైతులు పురుగుల మందు తాగి, తోటలోనే చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలొదులుతున్నారు. 1993 నుంచి 2004 మధ్య కాలంలో వరుస కరువులు విలయ తాండవం చేయడంతో 'అనంత'లో విషాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఓ వైపు ప్రకృతి ప్రకోపం, మరో పక్క పాలకుల చిన్నచూపు కారణంగా 'అనంత' ప్రజలు, రైతులు దయనీయ స్థితిలో ఉన్న వేళ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశా కిరణంగా కనిపించారు. 2004 ఎన్నికల్లో అఖండ విజయంతో సీఎంగా బాధ్యతలు చేపట్టి, అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించి అందరి బంధువుగా చరిత్రలో నిలిచారు.

- వ్యవసాయాన్ని పండుగలా మార్చిన దివంగత నేత వైఎస్సార్
- ఉచిత విద్యుత్, రుణమాఫీ, బీమా, సూక్ష్మసాగుతో రైతు ఇంట సంక్షేమం
- ఆరోగ్య శ్రీ ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం
- 108, 104 వాహనాలతో ప్రజల చెంతకే వైద్య సేవలు
- ఆయన హయాంలోనే సాగు, తాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం
- చాగళ్లు, పెండేకల్లు, జీడిపల్లి రిజర్వాయర్లు పూర్తి
- పీఏబీఆర్‌కు 10 టీఎంసీలు వచ్చేలా కృషి
- పాలనకు మానవతను జోడించి అందరిలో చెరగని ముద్ర

ఉచిత కరెంటుతో ఊపిరి..

2004లో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వేదికపైనే ఉచిత కరెంటు, విద్యుత్ బిల్లులు మాఫీ చేస్తూ తొలి సంతకంతోనే వ్యవసాయానికి ఊపిరి పోశారు మహానేత వైఎస్సార్. అలా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.70.65 కోట్ల విద్యుత్ బిల్లులు మాఫీ కాగా.. ఐదేళ్లు 1.75 లక్షల వ్యవసాయ మోటార్లకు రూ. వందల కోట్ల విలువ చేసే కరెంటు ఉచితంగా సరఫరా చేశారు. 2004కు ముందు రూ. 1,000 కోట్ల లోపున్న పంట రుణాలను రూ.6,594 కోట్లకు చేర్చారు. పావలా వడ్డీ కింద రూ.44 కోట్లు ఇచ్చారు.

పంటల బీమాతో ధీమా..

2004కు ముందు అప్పటి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా పథకాన్ని వైఎస్సార్ రైతులకు మేలు జరిగేలా మార్పు చేసి అంతులేని ధీమా కల్పించారు. 2004-2009 మధ్య వైఎస్ హయాంలో వేరుశనగ రైతులకు పంట కోత ఫలితాల ఆధారంగా బీమా కింద ఏకంగా రూ.1,138 కోట్ల పరిహారం ఇచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.100 కోట్లు అందించారు.

ఒకే విడతలో రుణమాఫీ..

2008లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నందున కేంద్ర ప్రభుత్వం సహకారంతో వైఎస్ ప్రభుత్వం 3,03,937 మంది రైతులకు చెందిన రూ.554.92 కోట్ల రుణాలు ఒకేవిడతలో మాఫీ చేసింది. అప్పటికే బ్యాంకులకు రుణాలు చెల్లించిన రైతులకు కూడా ప్రోత్సాహకాల కింద 3,61,269 మందికి రూ.5 వేల చొప్పున రూ.174.04 కోట్లు అందజేశారు. మొత్తమ్మీద రుణమాఫీ, ప్రోత్సాహకాల కింద ఒకే విడతగా 6,65,206 మంది రైతులకు రూ.625 కోట్ల ప్రయోజనం కల్పించారు.

విత్తన రాయితీలు..

ఏటా ఖరీఫ్, రబీలో రైతులకు లక్షల క్వింటాళ్ల వేరుశనగ, పప్పుశనగ, కంది, ఇతర విత్తనాలు రాయితీతో ఇచ్చారు. 2004- 2009 వరకు ఆరేళ్ల కాలంలో 28,05,901 మంది రైతులకు రూ.280.88 కోట్ల రాయితీతో 26,02,717 క్వింటాళ్ల వేరుశనగ అందించడంతో పాటు కంది, ఆముదం లాంటి ఇతర విత్తనాల కోసం రూ.80 కోట్లు ఖర్చు చేశారు.

అనుబంధ రంగాలకు ప్రాధాన్యత..

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన పాడి, పశుపోషణ, పట్టు, పండ్లతోటలు, డ్రిప్, స్ప్రింక్లర్ల రైతులకు కూడా చేయూతను అందించడంతో ఈ రంగాలు కూడా పురోగతి సాధించాయి. రూ.25 కోట్ల రాయితీ ఇచ్చి పశుక్రాంతి, జీవక్రాంతి కింద 50 శాతం రాయితీతో మేలుజాతి పశువులు, గేదెలు అందజేసి క్షీరవిప్లవానికి శ్రీకారం చుట్టారు. 40 వేల హెక్టార్ల పండ్లతోటల విస్తరణకు రూ.80 కోట్ల సబ్సిడీ ఇచ్చారు. దీంతో అప్పట్లోనే 'ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీ'గా పేరొచ్చింది. బిందు, తుంపర సేద్యం పరికరాలు ఎస్సీ ఎస్టీలకు వంద శాతం, ఇతర రైతులకు 90 శాతం రాయితీతో అందజేశారు. సూక్ష్మసేద్యం విస్తరణకు రూ.280 కోట్ల రాయితీ ఇవ్వడంతో 1.13 లక్షల హెక్టార్లకు చేరుకుంది.

సీమ కోసం 'జలయజ్ఞం'

అనంతపురం సెంట్రల్: జిల్లాలో కరువు నిర్మూలన కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పథకాన్ని యజ్ఞంలా కొనసాగించారు. నీలం సంజీవరెడ్డి హయాంలో నిర్మించిన తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆధునికీకరణతో పాటు కేవలం తాగునీటి పథకంగా ఉన్న హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని సాగునీటి పథకంగా మార్చి దాదాపు ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ.3,185 కోట్లతో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందించేలా పథకాన్ని చేపట్టారు. ఆయన చలువతోనే నేడు ఏటా శ్రీశైలం జలాశయం నుంచి 20 నుంచి 35 టీఎంసీల వరకూ కృష్ణా జలాలు జిల్లాకు వస్తున్నాయి. తుంగభద్ర జలాశయం నుంచి అత్యధిక నీరు జిల్లాకు వచ్చేందుకు రూ. 590 కోట్లతో హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా పెద్దపప్పూరు మండలంలో రూ. 244 కోట్లతో చాగల్లు ప్రాజెక్టు, రూ. 99 కోట్లతో పెండేకల్లు ప్రాజెక్టు నిర్మించారు. హెచ్చెల్సీ ఆధునికీకరణతో పాటు పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 10 టీఎంసీల తుంగభద్ర జలాలను కేటాయించారు. కేసీ కెనాల్ కోటాను పీఏబీఆర్‌కు మళ్లించి.. పోతిరెడ్డిపాడు నుంచి కేసీ కెనాల్‌కు 10 టీఎంసీలు వాడుకునేలా 2006లో నిర్ణయం తీసుకున్నారు. వైఎస్సార్ పుణ్యమా అని ప్రతి ఏడాది 5 నుంచి 6 టీఎంసీల నీరు పీఏబీఆర్‌కు అదనంగా అందుతున్నాయి.

నేడు వైఎస్సార్ వర్ధంతి

అనంతపురం కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 15వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 9.30 గంటలకు అనంతపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జెడ్పీ వద్ద ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తామన్నారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

అనంతపురం మెడికల్: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఆరోగ్య శ్రీ, 108, 104 పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాయి. అప్పటివరకూ కార్పొరేట్ ఆస్పత్రుల మెట్లు కూడా ఎక్కని పేద ప్రజలకు.. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా పైసా ఖర్చు లేకుండా వాటిల్లోనే ఉచితంగా ఖరీదైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు డాక్టర్ వైఎస్సార్. ఆయన హయాంలోనే చికిత్సల పరిధిని 860కి పెంచారు.

- ప్రమాదాల్లో గాయపడిన వారిని, అత్యవసరంగా సేవలు అవసరమైన రోగులను తక్షణమే ఆస్పత్రులకు తరలించేలా వైఎస్సార్ హయాంలో 2005 ఆగస్టులో 108ను ప్రవేశపెట్టారు.రోడ్డు ప్రమాదాలు,పాయిజన్, పాముకాటు తదితర ప్రాణాపాయ కేసులతో పాటు గర్భిణులు, బాలింతలు, రోగులను గోల్డెన్ అవర్‌లో నేటికీ 108 ద్వారా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఫోన్ చేస్తే క్షణాల వ్యవధిలో రోగుల వద్దకే వెళ్లి సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణం పోస్తోంది 108. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 66 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి.
- పీహెచ్‌సీలకు దూరంగా ఉన్న గ్రామాల్లో ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించేందుకు 104 పథకాన్ని ప్రవేశపెట్టారు. నెలలో 24 రోజులు గ్రామాలకు వెళ్లి వైద్యం అందించేలా పథకానికి రూపకల్పన చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 36 వాహనాలతో పాటు ఒక బ్యాకప్ వాహనాన్ని కూడా ఏర్పాటు చేశారు. నెలలో జిల్లాలోని 433 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను రెండు సార్లు కవర్ చేసేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

తండ్రికి మించి తనయుడు..

ఎంతో గొప్ప ఉన్నతాశయంతో తన తండ్రి తీసుకొచ్చిన పథకాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆరోగ్య శ్రీ వైద్య చికిత్సల పరిధిని 3,256కి తీసుకెళ్లారు. ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడమే కాకుండా మందులూ అందించారు. 'ఆసరా' పేరుతో రోగికి నగదు సాయం చేసి అండగా నిలిచారు. దీంతో పాటు ప్రతి మండలానికి 108 వాహనం ఉండేలా చర్యలు తీసుకున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలను సమకూర్చారు.

పింఛన్.. వంచనేనా!

బడుగులకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారు. ఓట్ల కోసం హామీ ఇవ్వడం.. గద్దెనెక్కిన తర్వాత పట్టించుకోకపోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటుగా మారిపోయింది. పింఛన్ వస్తే కుటుంబ అవసరాలకు కొంత ఉపయోగపడుతుందని ఆశించిన బడుగులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టతా రాకపోవడంతో అయోమయంలో పడ్డారు.

- బడుగులకు 50 ఏళ్లకే పింఛన్ అమలేదీ?
- 3 నెలలైనా పట్టించుకోని కూటమి సర్కారు
- మోసపోయామంటున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలు
- 50 నుంచి 60 ఏళ్ల లోపు వారు లక్ష మందికి పైగా ఎదురుచూపు




కొత్తచెరువులో పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ చేతన్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: టీడీపీ - బీజేపీ- జనసేన కూటమి అధికారంలోకి రావడానికి కారణమైన ప్రధానమైన హామీల్లో '50 ఏళ్లకే రూ.4వేల పింఛన్' ఒకటి. సాధారణంగా 60 ఏళ్లకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేస్తారు. అలాంటిది చంద్రబాబునాయుడు బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాల్లో 50 ఏళ్లకే ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు మంజూరు చేస్తామని ఉమ్మడి మేనిఫెస్టో-2024లో ప్రముఖంగా ప్రస్తావించారు. దీంతో చాలామందిని ఈ హామీ ప్రభావితం చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి సర్కారు కొలువుదీరి మూడు నెలలవుతోంది. హామీల అమలుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. ప్రస్తుతం జిల్లాలో 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, చర్మకారులు, డప్పు కళాకారులు తదితర కేటగిరీల కింద దాదాపు 2.68 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా ప్రభుత్వం సుమారు రూ.115 కోట్లు విడుదల చేస్తోంది. ఇక 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తే లక్ష మందికి పైగా లబ్ధిదారులు పెరుగుతారు. ఈ ఏడాది జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఆశావహులు ఎదురు చూస్తున్నారు. మూడు నెలలవుతున్నా ఇప్పటికీ దాని ఊసే లేక పోవడంతో 50 ఏళ్ల వయస్సు దాటిన వారిలో ఆందోళన మొదలైంది. తరచూ సచివాలయాలకు వెళ్లి సిబ్బందితో ఆరా తీస్తున్నారు. తమ దరఖాస్తులు తీసుకోండి.. అనుమతులు వచ్చినప్పుడు ఆన్‌లైన్‌లోకి ఎక్కించండి అంటూ బలవంతపెడుతున్నారు.

తగ్గిన పింఛన్ల సంఖ్య ..

50 ఏళ్లకే పింఛన్ మంజూరు సంగతి దేవుడెరుగు. ఉన్న పింఛన్లు ఎక్కడ తొలగిస్తారోనని పలువురు లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం రాగానే మొదటి నెల జూలైలో జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,70,973 పింఛన్లు ఉండగా.. ఆగస్టులో 2,69,207 మంజూరయ్యాయి. ఇక సెప్టెంబర్‌లో 2,68,079కి తగ్గిపోయాయి. గడిచిన మూడు నెలల్లో సుమారు 2,894 పింఛన్లు తగ్గిపోయాయి. ఇదే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా రెండు పర్యాయాలు నూతన పింఛన్లు అర్హులందరికీ అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్ కూడా మంజూరు చేయలేదని ప్రజలు వాపోతున్నారు.

దరఖాస్తులు తీసుకోలేదు



కూటమి ప్రభుత్వం రాగానే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 సంవత్సరాలు దాటగానే పింఛన్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇంత వరకూ దాని ఊసే లేదు. సచివాలయం వద్దకు వెళ్లి ఆరా తీస్తే ఇంకా అనుమతులు రాలేదని చెబుతున్నారు. దరఖాస్తులు తీసుకోవడం లేదు. మరి ఇప్పుడే ఇస్తారా.. లేదా అన్నదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

– రాజారత్నం, పుట్టపర్తి

వంచన తగదు



బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామంటే నమ్మి ఓట్లు వేశారు. కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి. అలా కాదని 50 ఏళ్లకే పింఛన్ హామీని అమలు చేయకుండా ఎత్తేస్తే మాత్రం ఆయా వర్గాల నుంచి నిరసన సెగ తప్పదు. హామీపై అనుమానాలు పెరగకముందే ఎప్పటి నుంచి అమలు చేస్తారో ప్రభుత్వం ప్రకటన చేస్తే బాగుంటుంది.

– ముంతాజ్, నిడిమామిడి

సమాచారం లేదు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరుకు సంబంధించి మాకు ఇంత వరకూ ఎటువంటి సమాచారమూ రాలేదు. గడిచిన మూడు నెలల్లో కోత పడిన పింఛన్లన్నీ.. మృతి చెందిన వారివే. కొత్త పింఛన్లకు దరఖాస్తు చేసుకోవడానికి ఇంకా సైట్ ఓపెన్ కాలేదు.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

కో'డల్'.. మామ హల్‌చల్

- ప్రజాసేవలో వెనుకబడిన ఎమ్మెల్యే సింధూరారెడ్డి
- షాడో ఎమ్మెల్యేగా మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి
- అనధికారికంగా అధికారులతో సమీక్షలు.. ఆదేశాలు



మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని సత్కరిస్తున్న పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద

పుట్టపర్తి టౌన్: రాజకీయ అరంగేట్రం చేసిన తొలిసారే ఎమ్మెల్యేగా గెలిచిన పల్లె సింధూరారెడ్డి ప్రజాసేవలో మాత్రం వెనుకబడ్డారు. తన గెలుపునకు బాటలు వేసిన మామ పల్లె రఘునాథరెడ్డి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తుండటంతో ఆమె డమ్మీ అయిపోయారు. ఎమ్మెల్యే హోదాలో ఆమె చేయాల్సిన కార్యకలాపాలన్నీ మామే చూసుకుంటున్నారు. ఆమె స్తబ్దుగా ఉండిపోవడంతో అసలు తాము ఎవరిని గెలిపించాము.. ఎవరు పెత్తనం చేస్తున్నారు అని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన పల్లె రఘునాథరెడ్డి తనకు ఏదో ఒక పదవి ఉండాలని భావిస్తున్నారో ఏమో తెలీదు కానీ కోడలి పదవిని అడ్డం పెట్టుకుని చక్రం తిప్పుతున్నారు.

కనిపించని సింధూర మార్క్..

విద్యావంతురాలు, కేరళ విశ్రాంత డీజీపీ కూతురు, మాజీ మంత్రికి కోడలు అయిన పల్లె సింధూరారెడ్డి ఎమ్మెల్యే మార్క్ చూపించుకోలేకపోతున్నారు. సామాజిక భద్రత పింఛన్లు మొదలుకొని అధికారుల బదిలీలు, మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలు, రేషన్ డీలర్‌షిప్‌లు, ఆశావర్కర్లు, మున్సిపల్ కమిషనర్ల మార్పులతో పాటు ప్రభుత్వ శాఖల ప్రగతిపై సమీక్షలను పల్లె రఘునాథరెడ్డే అనధికారికంగా సాగిస్తున్నారు. వివిధ అంశాలపై కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడటం, కలెక్టరేట్ రివ్యూ సమావేశాలకూ హాజరై తాను మాట్లాడడం, ఆదేశాలు జారీ చేయడం చేస్తున్నారు. కోడలిని డమ్మీగా మార్చి మామే క్రియాశీల పాత్ర పోషిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాదు నియోజకవర్గంలో నియమితులైన, బదిలీ అయిన అధికారులు సైతం రఘునాథరెడ్డినే కలవడం.. సన్మానాలు చేయడం నిత్యకృత్యమయ్యాయి. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధి ప్రజా సేవకు దూరంగా ఉండటం.. ఆమె స్థానంలో మరొకరు పెత్తనం చెలాయించడం చర్చనీయాంశంగా మారింది.

పేకాట స్థావరంపై దాడి

రొళ్ల: రత్నగిరి గ్రామ పొలిమేర కొండ ప్రాంతంలోని పేకాట స్థావరంపై సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం దాడి చేశారు. నవీన్, శివశంకర్‌నాయక్, హరీష్‌తో సహా పది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.1,02,550 నగదు, ఏడు బైక్‌లు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 38 మంది పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పరారీలో ఉన్న 28 మందిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు. పేకాటస్థావరంపై దాడి చేసిన వారిలో జమేదార్లు రామలింగయ్య, రమణ, కానిస్టేబుళ్లు షఫీ, నరసింహమూర్తి, దిలీప్ తదితరులు ఉన్నారు.



పేకాటరాయుళ్ల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రాజ్‌కుమార్, ఎస్‌ఐ రాజశేఖర్

క్లుప్తంగా

ఆలస్యంగా నడిచిన మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు



గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌కు ఆలస్యంగా వచ్చిన మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

గుత్తి: మచిలీపట్నం – ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం 2.15 గంటల ఆలస్యంగా గుత్తి ఫోర్ట్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. భారీ వర్షాల కారణంగా రైలు ఆలస్యంగా వచ్చిందని రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. మచిలీపట్నం నుంచి గుతి రైల్వే ఫోర్ట్ స్టేషన్‌కు ఉదయం 7.50 గంటలకు రావాల్సి ఉండగా 10.05 గంటలకు వచ్చింది. ముందుగా రైల్వే అధికారులు ప్రకటన చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

అనుపమకు ఆర్డీఓగా పదోన్నతి



పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనుపమకు ఆర్డీఓగా పదోన్నతి లభించింది. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆమెను పుట్టపర్తి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. తహసీల్దార్‌గా వచ్చిన పక్షం రోజుల్లోనే ఆర్డీఓగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆమెకు తోటి సిబ్బంది అభినందనలు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని పారిశ్రామికవాడలో కొందరు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో డీఎస్పీ మహేష్ పర్యవేక్షణలో ఆదివారం సీఐ ఆంజనేయులు, సిబ్బంది తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడలో తనిఖీలు చేపట్టారు. గంజాయి అమ్మకం చేస్తున్న హిందూపురం పట్టణం బసవనపల్లికి చెందిన జోగిందర్ ప్రసాద్, పట్టణంలోని ఆర్పీజీటీ రోడ్‌లో ఉంటున్న షేక్ వసీం అనే వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1200 గ్రాముల గంజాయిని , మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పట్టుబడిన వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

ఊరూరా బార్లా తెరిచారు!

పల్లెపల్లెకో బెల్ట్‌షాపు. ఆంధ్ర, కర్ణాటక ఏ రాష్ట్రానికి చెందిన మద్యమైనా సరే క్షణాల్లో కళ్ల ముందు ప్రత్యక్షం. అర్ధరాత్రయినా సరే ఫోన్ కొడితే మందు డోర్ డెలివరీ అవుతుంది. అందుకే మందుబాబులంతా పగలు, రాత్రి తేడా లేకుండా తాగి ఊగుతున్నారు. కుటుంబాలను రోడ్డున నిలబెడుతున్నారు.

జిల్లాలో జోరుగా 'బెల్టు' దందా

- మారుమూల గ్రామాల్లోనూ మద్యం విక్రయాలు
- ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ ముంచెత్తుతున్న మందు
- హోటళ్లు, రెస్టారెంట్లలో మద్యం తాగేందుకు అనుమతులు
- 'మామూళ్ల' మత్తులో పోలీసు వ్యవస్థ
- చెక్‌పోస్టుల్లో తనిఖీలు శూన్యం.. జిల్లాలోకి కర్ణాటక మద్యం

సాక్షి, పుట్టపర్తి

గత ప్రభుత్వ హయాంలో కనుమరుగైన బెల్ట్‌షాపులు ఇప్పుడు ఊరూరా వెలిశాయి. చిల్లర దుకాణాలు, టీ స్టాళ్లు, జనరల్ స్టోర్లలోనూ మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. చివరకు ఆధ్యాత్మిక కేంద్రాల్లోనూ మద్యం దందా జోరుగా సాగుతోంది. హోటళ్లు, రెస్టారెంట్లలోనూ మద్యం సేవించడానికి అనధికార లైసెన్స్‌లు వచ్చేశాయి. అందుకే చాలా రెస్టారెంట్లలో మందు బాబులు హల్‌చల్ చేస్తున్నారు. తప్పతాగి తండ్లాటకు దిగుతున్నారు. ఇక సరిహద్దులో తనిఖీలు శూన్యం కావడంతో కర్ణాటక మద్యం జిల్లాలోకి భారీగా వచ్చి చేరుతోంది. అందుకే ఏ గ్రామ శివారున చూసినా.. కర్ణాటక మద్యం ఖాళీ బాటిళ్లు కనిపిస్తున్నారు.



మద్యం... ఆదాయ మార్గం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, ఆయా పార్టీల నేతలు సంపాదన కోసం మార్గాలు వెతుక్కున్నారు. ఈ క్రమంలోనే సులువుగా డబ్బు సంపాదించాలనే క్రమంలో చాలామంది మద్యం వ్యాపారంలోకి దిగారు. దొరికినప్పుడు పోలీసులకు ముడుపులు ముట్టచూపి.. రాత్రింబవళ్లు విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా కర్ణాటక నుంచి చీప్ లిక్కర్లు తెప్పించి స్థానికంగా విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రతి గ్రామంలోనూ ఓ వ్యక్తిని నియమించుకున్నారు. ఫోన్ చేస్తే చాలు... ఏ సమయంలోనైనా.. ఉన్న చోటకే మద్యం తెచ్చి ఇస్తున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తూ.. లాభార్జన

కర్ణాటకలో రూ.100 దొరికే క్వార్టర్ (180ఎంఎల్) స్థానికంగా రూ.200 విక్రయిస్తున్నారు. ఆంధ్ర ప్రభుత్వ దుకాణంలో రూ.220 దొరికే క్వార్టర్‌ను బెల్ట్‌షాపుల్లో రూ.270 ఇస్తున్నారు. డోర్ డెలివరీ అయితే మరో రూ.50 అదనంగా తీసుకుంటున్నారు. డిమాండ్‌కు అనుకూలంగా అక్రమార్కులు అడ్డదార్లు తొక్కుతూ 'క్యాష్' చేసుకుంటున్నారు. కర్ణాటకతో పాటు గోవా, మహారాష్ట్ర మద్యం కూడా అక్కడక్కడా విక్రయిస్తున్నారు. గోవాలో రూ.300 ఇచ్చే ఫుల్ బాటిల్ (750ఎంఎల్)ను ఇక్కడ రూ.వెయ్యికి విక్రయిస్తున్నారు. మహారాష్ట్రలో రూ.80 దొరికే క్వార్టర్‌ను ఇక్కడ బెల్ట్‌షాపుల్లో ఏకంగా రూ.220 వరకు విక్రయిస్తున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంలోనూ..

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పుట్టపర్తి చుట్టుపక్కల మద్యం దుకాణాలు, బార్‌లకు భగవాన్ శ్రీసత్యసాయి బాబా ఉన్నప్పటి నుంచి అనుమతులు లేవు. కానీ ప్రస్తుతం పర్యవేక్షణ లేకపోవడంతో సాయిబాబా మందిరం చుట్టుపక్కల వీధుల్లో బెల్టు షాపులు వెలిశాయి. ఇప్పటికే కొందరిని పలుమార్లు పోలీసులు పట్టుకుని వదిలేశారు. అయినా సులభంగా డబ్బులు సంపాదించేందుకు అలవాటుపడిన యువత.. మద్యం విక్రయాలు మానడం లేదు. ప్రస్తుతం ఐదారు చోట్ల బెల్ట్ షాపులు నడుస్తున్నట్లు సమాచారం. పట్టించుకోవాల్సిన పోలీసులు 'మామూళ్ల' మత్తులో అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

వెలుగు చూసిన ఘటనల్లో కొన్ని..

- రెండు రోజుల క్రితం బత్తలపల్లి మండలం చిత్రావతి నది సమీపంలో చెన్నై జాతీయ రహదారిపై టీడీపీ నేత పత్తిపాటి నారాయణమూర్తి మద్యం విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతని ఇంట్లో సోదాలు చేయగా, భారీగా మద్యం లభ్యమైంది. దీంతో పోలీసులు నారాయణమూర్తిపై కేసు నమోదు చేశారు.
- గురువారం బత్తలపల్లి మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు... అతని వద్ద నుంచి 352 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.
- వారం రోజుల క్రితం పుట్టపర్తిలో రాత్రి 10 గంటల సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో రెండు ఆంధ్ర మద్యం సీసాలు తీసుకొని శిల్పారామం వెళ్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. తాగేందుకు వెళ్తున్నానని చెప్పడంతో వదిలేశారు. ఆ తర్వాత ఆ మద్యం అధిక ధరలకు విక్రయించి తిరిగొచ్చాడు. పోలీసులకు అనుమానం వచ్చి గాలించగా.. సదరు వ్యక్తి పరారయ్యాడు.
- సోమందేపల్లి మండల కేంద్రంలో సుమారు 14 చోట్ల కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రతి నెలా పోలీసులకు మామూళ్లు ఇస్తుండటంతో ఎలాంటి తనిఖీలు చేయకుండా ఉన్నట్లు తెలిసింది. పెనుకొండ మండలం శెట్టిపల్లిలో కర్ణాటక మద్యంతో పాటు నాటు సారా విక్రయ కేంద్రాలు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిసింది.
- లేపాక్షి మండల పరిధిలో కర్ణాటక సరిహద్దులోని గ్రామాల్లో విపరీతంగా కల్తీ కల్లు, కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారు. హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ పరిధిలో రాత్రింబవళ్లు కర్ణాటక మద్యం అందుబాటులోకి వస్తోంది.
- కొడికొండ, తూమకుంటలో చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ.. తనిఖీలు చేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఫలితంగా అక్రమ మద్యం సరిహద్దు దాటి వస్తోంది.

ఎవరినీ వదిలేది లేదు



అక్రమ మద్యం రవాణాదారుల ఆట కట్టిస్తాం. బెల్ట్‌షాపులు నిర్వహించే వారిపైనా ఉక్కుపాదం మోపుతాం. కర్ణాటక మద్యం, నాటు సారా విక్రయాలు నేరం. అక్రమ మద్యం విక్రేతలపై పీడీ యాక్టు ప్రయోగిస్తాం. బహిరంగ మద్యపానం నిషేధం. పట్టుబడితే కేసులు నమోదు చేస్తాం. సరిహద్దులో ప్రత్యేక బలగాలు ఉన్నాయి. చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయిస్తాం.

– వి.రత్న, ఎస్పీ

కారు దొంగతనం కేసులో ఇద్దరి అరెస్ట్



నిందితులతో పాటు చోరీ చేసిన కారును చూపుతున్న పోలీసులు

ముదిగుబ్బ: కారు దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.6,63,000 విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నట్లు ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వారం రోజుల క్రితం ముదిగుబ్బలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న వేల్పుల విజయసింహ ఇంటి ముందు నిలిపి ఉంచిన కారును దొంగలు అపహరించుకెళ్లారన్నారు. బాధితుడు విజయసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశామన్నారు. ఇందులో భాగంగా పలు చోట్ల సీసీ కెమెరాలను పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో తన సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం ముదిగుబ్బ శివారులోని దొరిగిల్లు రోడ్డు ఫ్లైఓవర్ సర్కిల్‌లో దొంగిలించిన కారుతో పాటు ముదిగుబ్బకు చెందిన షేక్ బాబ్జాన్, కొలిమి సురేష్‌లను అరెస్ట్ చేశామన్నారు. కేసును త్వరగా చేధించడంతో ఎస్పీ రత్న ప్రత్యేకంగా సీఐతో పాటు సిబ్బందిని అభినందించారు.

'ఊజీ'తో తగ్గుతున్న పట్టుగూళ్ల ఉత్పత్తి



పట్టు పురుగుపై కాటు వేస్తున్న ఊజీ ఈగ

అనంతపురం అగ్రికల్చర్: పట్టుగూళ్ల ఉత్పత్తిపై ఊజీ ప్రభావం అధికంగా ఉండటంతో మల్బరీ రైతులకు నష్టం జరుగుతోందని ప్రాంతీయ పట్టు పరిశోధనా స్థానం (రీజనల్ సెరికల్చర్ రీసెర్చ్ సెంటర్-ఆర్ఎస్ఆర్ఎస్) పరిశోధక విద్యార్థులు వై.ప్రవీణ్‌రెడ్డి, యు.అనిల్‌కుమార్, ఎం.పరశురాముడు, కె.నందిని తెలిపారు. ఎస్కే యూనివర్సిటీలో ఎంఎస్సీ సెరికల్చర్ పూర్తి చేసి ఆర్ఎస్ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్ నేతృత్వంలో పట్టుకు సంబంధించిన అంశాలపై పరిశోధన విద్యార్థులుగా పనిచేస్తున్నారు. పరిశోధన ఫలితాల గురించి తెలియజేశారు.

వర్షాకాలంలో అధికం:

ఊజీ ఈగ మల్బరీ పురుగులను ఏడాది పొడవునా ఆశిస్తున్నా... వర్షాకాలంలో వాటి ఉధృతి అధికంగా ఉంటుంది. ఇది ఆశిస్తే 15 శాతం వరకు పట్టుగూళ్ల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఊజీ ఆశించిన పట్టు పురుగు శరీరంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. పట్టుగూళ్లకు కొనభాగంలో గుండ్రటి రంధ్రం ఏర్పడుతుంది.

నివారణ చర్యలు

రేషం షెడ్డు వాకిళ్లు, కిటికీలు జాలరీ, నైలాన్‌నెట్ బిగించాలి. గదులకు స్వయంచాలిత తలుపులు బిగించాలి. షెడ్డులోకి ఊజీ ఈగలు ప్రవేశించకుండా నిర్బంధగది ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. పసుపు రంగు ద్రావణంతో ఎరలు ఏర్పాటు చేసి మగ, ఆడ ఈగలను ఆకర్షించేలా చేయాలి. జీవనియంత్రణ పద్ధతిలో ఇంటి ఈగల ప్యూపాల నుంచి తయారు చేసిన నిసోలింక్స్ థైమస్ అనే పరాన్న జీవిని నైలాన్‌వలలో చిన్న సంచిలాగా ఏర్పాటు చేసుకోవాలి. పట్టుపురుగుల విసర్జన పదార్థాలు బహిరంగ ప్రదేశాలలో వేయకుండా వాటిని ప్లాస్టిక్ కవర్లలో పెడితే 15 నుంచి 20 రోజుల తర్వాత వాటి నుంచి బయటకు వచ్చిన ఊజీ ఈగలను నశింపజేయాలి.

ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ నిర్లక్ష్యంతో నిండు ప్రాణం బలి



శ్రీధరగుట్టలో నీటిగుంత నుంచి మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

చిలమత్తూరు: సెల్ఫీ మోజుతో నీట మునిగి మృతి చెందిన హిందూపురానికి చెందిన మహమ్మద్ కైఫ్ (22) మృతదేహాన్ని ఆదివారం గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది వెలికితీశారు. వివరాల్లోకి వెళితే... శనివారం కుటుంబ సభ్యులతో కలిసి మహమ్మద్ కైఫ్ మండలంలోని యగ్నిశెట్టిపల్లి సమీపంలోని శ్రీధరగుట్టకు విహార యాత్రకు వచ్చారు. ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడంతో ఆ ప్రాంతంలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండపై భారీగా నీరు చేరింది. ఈ సందర్భంగా ఈతరాని కైఫ్ నీటిలో దిగి ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయి చనిపోయాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంలో రియాజ్‌వుల్లా కుటుంబం కన్నీరు మున్నీరైంది.

అడుగడుగునా కనిపిస్తున్న ఎస్ఆర్‌సీ నిర్లక్ష్యం

శ్రీధరగుట్టలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టింది. అనుమతులు ఒకచోట తీసుకొని మరోచోట తవ్వేశారు. క్వారీతో పాటు క్రషర్ కూడా ఆ సంస్థే నిర్వహిస్తోంది. కనీస నిబంధనలు పాటించని యాజమాన్యం.. అక్కడ పనిచేసే కూలీలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పెద్ద గుంతలు చేయడంతో పాటు నీటి వద్ద ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శిస్తున్నారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇచ్చిన కారణంగానే గుంతలు ఏర్పడ్డాయని, అందుకే ప్రాణనష్టం జరుగుతోందని చెబుతున్నారు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా ఎస్ఆర్‌సీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

- తొమ్మిది మందికి గాయాలు



గాయపడిన పెద్ద వీరప్ప,లక్ష్మీనారాయణమ్మ, నాగరత్న, ఓబిలేసు, చిన్న వీరప్ప

బత్తలపల్లి: ప్రేమ వివాహం చేసుకుని అత్తగారి ఇంటి వద్ద ఉన్న కుమారుడు ఇంటికి రావడంలేదని ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో తొమ్మిది మంది గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసుల వివరాలమేరకు.. బత్తలపల్లి మండలం తంబాపురానికి చెందిన సూర్యనారాయణ కుమార్తె సంధ్య, ధర్మవరం రూరల్ మండలం బడన్నపల్లికి చెందిన ఓబిలేసు కుమారుడు ఆకాష్ ఆరు నెలల క్రితం పెద్దల ప్రమేయం లేకుండా ప్రేమ వివాహం చేసుకున్నాడు. పెళ్లి తర్వాత బడన్నపల్లికి వెళ్లలేదు. దీంతో రెండు కుటుంబాల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఓబిలేసు భార్య సునీత తన పుట్టినిల్లు అయిన తంబాపురానికి శనివారం చేరుకుంది. తన అన్న పోతలయ్యకు రాఖీ కట్టేందుకు వచ్చింది. అదే కాలనీలో ఉన్న సూర్యనారాయణ తండ్రి రాముడుకు సునీతకు చిన్నపాటి గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న సంధ్య తల్లిదండ్రులు ఆదివారం బెంగుళూరు నుంచి గ్రామానికి చేరుకున్నారు. తరువాత గ్రామంలోనే బంధువుల ఇంటి వద్ద ఓబిలేసు వర్గీయులు ఉండగా సూర్యనారాయణ వర్గీయులు వెళ్లి ఘర్షణకు దిగారు. ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకోవడంతో సూర్యనారాయణ వర్గీయులలో సూర్యనారాయణ, లక్ష్మీ, ఆకాష్, శివశంకర్‌కు గాయాలయ్యాయి. ఓబిలేసు వర్గీయులలో ఓబిలేసు, చిన్న వీరప్ప, పెద్ద వీరప్ప, నాగరత్న, లక్ష్మీనారాయణమ్మకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి, ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదులు ఇచ్చారు. ఓబిలేసు ఫిర్యాదు మేరకు సూర్యనారాయణ, శివశంకర్, తిరుపాలు, లక్ష్మీనారాయణ, ఆకాష్‌పైన, సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఓబిలేసు, సునీత, చిన్న వీరప్ప, పెద్ద వీరప్ప, పోతులయ్యపైన కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో అమలవుతున్న సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే ఆదివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలకు వ్యతిరేకంగా ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని... బిక్ష కాదన్నారు. పాతిక, 30 సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ అనంతరం గౌరవప్రదంగా జీవించాలంటే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కమిటీ మెంబర్ శ్రీనివాసులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జవహర్, ఉపాధ్యక్షుడు లక్ష్మీప్రసాద్, జిల్లా కౌన్సిలర్ ప్రసాద్, సభ్యులు సంపత్‌కుమార్, సుందర సుకుమార్, రవిచంద్ర, కిష్టప్ప, నరసింహమూర్తి, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

18 మండలాల్లో వాన

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 18 మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. కనగానపల్లిలో అత్యధికంగా 12.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రామగిరిలో 6.4, ధర్మవరంలో 6.2, గోరంట్లలో 6.2, బత్తలపల్లిలో 5, ముదిగుబ్బ, కదిరి, కొత్తచెరువులో మండలాల్లో 4.2, రొళ్లలో 3.2, తాడిమర్రిలో 2.6, సీకేపల్లి, నల్లచెరువులో 2.4 చొప్పున, మడకశిర, పుట్టపర్తి, తనకల్లు లో 2.2, తలుపుల, గాండ్లపెంటలో 2, అమరాపురం 1 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

ఘనంగా మీడియా సెంటర్ వార్షికోత్సవం



సంగీత విభావరిలో పాల్గొన్న సత్యసాయి మీడియా సెంటర్ సిబ్బంది



చిన్నారుల నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో సత్యసాయి మీడియా సెంటర్ 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత మీడియా సెంటర్ సిబ్బంది సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి నిర్వహించారు. చిన్నారులు చక్కటి భక్తిగీతాలకు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష మంది సబ్‌స్క్రైబర్లను పొందిన సందర్భంగా ప్రత్యేకమైన సిల్వర్ బటన్ అవార్డును మీడియా సెంటర్‌కు అందజేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ మీడియా సెంటర్ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మందికి సాయికుల్వంత్ సభా మందిరంలో జరిగే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను చేరువచేస్తుండటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

విస్తారంగా వరి సాగు



గోరంట్ల మండలం కరావులపల్లి వద్ద సాగైన వరి పంట

పుట్టపర్తి అర్బన్: నీటి వనరులు సమృద్ధి ఉన్న రైతులు వరిసాగు చేస్తున్నారు. గత ఏడాదికి మించి ఈసారి వరి పంట వేశారు. గత ఏడాది 1400 హెక్టార్లకు మించకుండా వరి సాగు చేశారు. దీంతో బయట మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో రైతులు కాస్తోకూస్తో సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని భావించి ఎక్కువ మంది రైతులు వరి వైపు మొగ్గు చూపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ 2,310 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలో అత్యధికంగా బుక్కపట్నం మండలంలో 253 హెక్టార్లు, కొత్తచెరువు మండలంలో 227, పెనుకొండలో 210 , అమడగూరులో 200, ఓడీ చెరువులో 158, తాడిమర్రిలో 130, సీకేపల్లిలో 127 , రొద్దంలో 122 హెక్టార్లలో వరి సాగు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.



కప్పలబండ వద్ద వరి సాగుకు సిద్ధం చేస్తున్న రైతన్న